# సర్ప కంకణం

నిరంజన ఆ జనం మధ్య కూచుని వుంది. ఆడవాళ్ళ ప్రక్కనించి సిల్కుచీరల మెరుపులూ, ఎలక్ట్రిక్ లైట్లలో ఆభరణాల ధగధగలూ, నున్నగా దువ్విన జుట్టుల నిగనిగలూ కళ్ళు జిగేలు మనిపిస్తున్నయి. ప్రక్క బాజులో మగవాళ్ళు కూచుని తదేకదృష్టితో పీఠంవేపు చూస్తున్నారు - ఉత్తరీయాలు మోకాళ్ళకీ, నడుములకీ కలిపి చుట్టూ చుట్టుకుని క్రింద కూచున్న పెద్దవాళ్ళూ, పంట్లాలు సరిగ్గా వంగక కాళ్ళు దూరంగా పెట్టుకుని కూచున్న యువకులూన్నూ. పందిరి స్తంభాల నానుకుని కాలేజీ విద్యార్థులూ, విద్యార్థినిలు కొంతమంది Writing Pads మీద అప్పుడప్పుడూ ముఖ్య విషయాలు వ్రాసేసుకుంటూ, తిరిగీ తలలెత్తుతూ అమిత ఆసక్తితో వేదిక వైపు చూస్తున్నారు. ఫేసుపౌడర్లూ, విరియపూసిన పువ్వులూ, అక్కడక్కడా స్తంభాలమీద, వేదికమీద కాల్తూన్న సాంబ్రానిపుల్లలూ వెలువరించే కమ్మని సువాసనలు సభావరణం అంతా అలుముకుంటున్నయి. అనిర్వచనీయమైన ఆనందమూ, తృప్తీ అందరి హృదయాలనీ ఆవరించినయి - గుడి గర్భాలయంలో ధూపంలా.

వేదికపైన మణి చందన మాలాంకృతులై అపరబ్రహ్మలా సౌమ్యవదనులు శ్రీ నిత్యానందస్వాములవారు ప్రసంగిస్తున్నారు.

"నకామయే అహం గతి మీశ్వరాత్పరమ్
అష్టర్థియుక్తామ పునర్భవం వా''

"ఓ భగవాన్, నేను నిన్ను ప్రార్థించేది స్వర్గంలో అత్యున్నతస్థానంకోసంకాదు. అష్టసిద్ధులకోసమూ కాదు. జనన మరణ విమోచనకోసమూ కాదు.''

అయితే రంతిదేవుడు కోరేది మరి దేనికోసం ? చూద్దాం.

"ఆర్తిం ప్రపద్యే అఖిలదేహ భాజామంత:
స్థితో యేన భవంత్యదుఃఖాః!''

"స్వామీ, నాకు ఒక్క వరం ప్రసాదించు. నా తోటి మానవులు అనుభవిస్తున్న దుఃఖాలలోనూ, బాధలలోనూ కించద్భాగమైనా నన్నుకూడా అనుభవించనియ్యి. అందువల్ల తోటి మానవుల దుఃఖభారం ఏ అణుమాత్రము తగ్గినా నా కంతేచాలు దేవుడా."

ఈ ప్రార్థన.... ..... ....."

స్వామి మాట కడ్డుగా వేదిక వెనక వైపునించీ ఎదురొమ్ము మీద లాల్చీకి badge తగిలించుకున్న ఆ సమాజపు కార్యదర్శి ఆతురతతో వచ్చి, స్వాములవారి చెవిలో మెల్లగా ఏదో చెప్పారు. స్వాములవారి ముఖంలో దిగులు క్రమ్మింది. ఏదో నిమ్మళంగా బదులు చెప్పారు. ఆ కార్యదర్శి, వెంటనే మైక్రోఫోన్‌వద్దకి వచ్చి, "మన్నించండి, సభికులకి ఒక ముఖ్య విషయం. ఈ నగరంలో నేతాజీ వీధి 10 వ నెంబరు రాజకుమారి నగర్ కాపరస్థులు శ్రీ సుకుమార్‌గారు accident అయి హాస్పిటల్‌లో వున్నారు. వారి భార్యగాని మరి ఎవ్వరైనా కావలసినవారుగాని వెంటనే ఈ సభ ఆఫీసు గదివద్దకి వెళితే అన్ని వివరాలు చెప్పడానికి మనుష్యులు వచ్చి వున్నారు," అన్నారు విచారం సూచిస్తున్న ముఖంతో.

తక్షణం సభ అంతా నిశ్శబ్దం అయింది. సభికు లందరూ వెనక్కీ ప్రక్కకీ తలలు తిప్పి ఆతురతతో చూడ నారంభించారు – కాస్త జాలిచూపులతో.

నిరంజనకి పైప్రాణం పైనే లేచిపోయి నట్టయింది. ఉన్నపళంగా క్రింద పడిపో బోయింది. నిభాయించుకుని లేచి పాప నెత్తుకుంది. ప్రక్కనున్న ఒక పెద్దావిడ చెయ్యిపట్టుకుని నడిపించింది.

సభంతా వివరమెరుగని కలవరం ఆరంభమయింది. ఎవరికి వారు ఏదో వ్యాఖ్యానం చేస్తున్నారు – సానుభూతితో.

నిరంజనకి కాళ్ళు తేలిపోతూన్నాయి. అందరూ ఒత్తిగిల్లి దారి ఇచ్చారు.

సభ దాటి పదడుగులు వెయ్యగానే, "ఇదిగో అమ్మాయ్, ఇటుచూడమ్మా, ఇల్లారా, ఇటు," అంటూ, ఒక పెద్ద వయస్సాయన నిరంజన ముందరికి రెండంగ

లలో వచ్చి తన చేతిలో వున్న బెత్తంతో, ప్రక్కకి చూపిస్తూ, ఆ వేపు మెల్లిగా నడిచాడు. నిరంజన మాట్లాడకుండా అతని వెనక నడిచింది.

"ఈవేళ మీ ఇంటాయనకి ప్రాణాపద తప్పిందంటే ఇదిగో అమ్మా, ఇతను- ఈ అబ్బాయి కారణం.'' అన్నారాయన, counter వేపు చూపిస్తూ.

Counter బల్ల నానుకుని ఒక యువకుడు, పంట్లాం జేబులో చెయ్యి పెట్టుకుని, ఏదో పరధ్యానంగా దిఙ్మండంలోకి చూస్తూ, దిగులుగా నిలబడి వున్నాడు.

నిరంజనకి నాలిక పిడారిపోయింది. మాట రాలేదు.

ఆ యువకుడు చటుక్కున నిటారుగా నిలబడి దణ్ణంపెట్టాడు.

నిరంజన చేతులు జోడిస్తూ, "ఆయన ఎక్కడున్నారు ? ఏమయింది?'' గాభరా గాభరాగా ఒకళ్ళ ముఖం విడిచి ఒకళ్ళముఖం కేసి చూస్తూ, అడిగింది. ఎండిపోయిన నాలికమీదనించీ కష్టంమీద పెగుల్చుకొచ్చిన మాటలవి.

"ఆయనకి ఏమీ భయం లేదుట. భయపడ నక్కర్లేదమ్మా,'' అన్నారు పెద్దాయన.

"హాస్పటలులో వున్నారండీ ఆయన. మీరు వెళ్లి చూడవచ్చు.'' అందుకున్నా డాయువకుడు ఇంగ్లీషులో.

"మీ ఇంటి తలుపు బీగంలో మడిచిపెట్టివున్న చీటి చూశాం. మీరు ఈ సభకి వెళుతున్నట్టు వ్రాసిపెట్టివుంది దానిలో. తిన్నగా ఇక్కడికి వచ్చేశాం,'' అన్నాడు తిరిగి యువకుడు.

నిరంజనకి ఏడవాలనిపించింది. ఎంతో కష్టంమీద ఏడుపు ఆపుకోబోయింది. అయినా వెక్కివెక్కి ఏడుపు వచ్చేస్తోంది. పెద్దాయన ప్రక్కనున్న కుర్చీ లాగి, "అమ్మా, ఇల్లా కూర్చో, కూర్చో, అమ్మా.'' అన్నారు, జాలిగా.

నిరంజన చేతులో పాపాయి గావురుమని పెద్దగా ఏడవ నారంభించింది.

"నా దగ్గరికి రా అమ్మా, రా, ఏడవకూడదుగా మరి.'' అంటూ చేతులు చాపాడు, యువకుడు. పాపాయి లతని చేతుల్లోకి వాలిపోయింది.

ఒక్క క్షణమాగి, "అమ్మాయ్, మరి నువ్వు ఇక తమాయించుకోవాలి. Taxi wait చేస్తూందట. హాస్పిటలుకి పోదాం. అసలు మీ ఇల్లు వెతుకుతూనే మాయింటి కొచ్చాడు ఇతను. నన్ను నువ్వు ఎరగకపోయినా, 10వ నెంబరులో నిన్ను నేను ఈ గత 4, 5 దినాలలో ఒక అరడజను సార్లు చూశాను. మీ ప్రక్క ఇల్లే మాది. పెద్దవాణ్ణి అని కాస్త కూడావుండమన్నాడు. అసలతను అడగాలా? ఇరుగుపొరుగు వాళ్లం. ఆపదలకి ఒకళ్ళ కొకళ్ళు అవకుండా వుండడానికి మనమేమి మనుష్యులం కామా? రాక్షసులమా? ఏం కట్టుకుపోతాం పోయేటప్పుడు!" అన్నారు, పెద్దాయన ఓదార్పు స్వరంతో.

నిరంజన కూడావచ్చిన పెద్దావిడ, "పోనీలెండి పాపం ప్రాణభయం లేకపోతే అంతేచాలు," అంటూ సభావరణలోకి తిరిగి వెళ్లిపోయింది.

"అతనికీ, కాళ్ళకి ఏవో బలంగా గాయాలు తగిలాయట. అసలు నువ్వు కదులు. ఇంక ఏడుపెందుకు. అతను తేరుకుంటున్నాడుగా," అంటూ పెద్దాయన, ముందరికి రెండడుగులువేశారు.

లేవబోతే కాళ్ళు తేలిపోతున్నాయి, నిరంజనకి. మనస్సు నిబ్బరంచేసుకుని అప్పటికే చుట్టూ గుమిగూడిన పల్చటి జనాన్ని తప్పించుకుని, నిద్రలో నడిచినట్టు నడిచింది నిరంజన, పెద్దాయన ప్రక్కగా.

Taxi కదిలాక, "అదీ మరీ మారుమూల సందుటమ్మా, సుకుమార్‌గారు పడిపోయింది. మనుష్య సంచారం లేదుట, అంతగా. ఈ అబ్బాయి ఆదారిని వస్తున్నాడుట. పడివున్న మనిసిని చూశాడుట. తక్షణం వెనకా ముందూ యోచించ కుండా పరిగెట్టుకెళ్ళి ఒక టాక్సీ తెచ్చి, వెంటనే హాస్పిటలుకి చేర్చేశాడుట. యోగ్యుడు," వివరించారు పెద్దాయన.

"ఆయన జేబులో పోస్టు చెయ్యడానికని ఒక పోస్టుకార్డు వుందండి. అది చదివేశాను. దానిలో మీరు క్రొత్తగా ఈ ఇంటికి మారినట్టూ, బంధువుల కెవ్వరికో వ్రాసివుంది. అల్లా దొరికింది మీ అడ్రస్సు," అన్నాడు ముందరిసీటులోంచి ఆ యువకుడు, పాపాయి అతని ఒళ్లో కూచుని, అతని మెడలో వున్న బంగారపు సన్న గొలుసు, షర్టులోనించి బయటికి తీసి దానితో ఆడుతోంది.

* * * *

వార్డులోకి వెళ్ళకముందే డాక్టరు ఒకాయన లోపలినుంచి వరండాలోకి వస్తున్నారు. నిరంజన ముఖం చూడంగానే ఆగి పోయారు. "Easy. Easy! Nothing to worry! You are Mrs. Sukumar? మీరు అదృష్టవంతులమ్మా. ఆ టైముకి మీ brother ఆయన్ని చూసివుండకపోయినట్టయితే, శరీరంలో వున్న రక్తమంతా గాయాలలో నించీ బయటికి పోయి వుండును. ప్రాణం దక్కి వుండదు. అప్పటికీ hospitalకి రాగానే రక్తం transfusion ఇవ్వవలసి వచ్చింది. మీ అన్నగారు తన రక్తం ఇవ్వకపోయినట్లయితే చాలా డేంజరయిపోయియుండును. అదృష్టం ఆయన రక్తం మాచ్ అయింది. మాకా, రక్తం స్టాక్ లేకపోయింది సమయానికి!'' అన్నారు డాక్టరు, గౌరవంగా యువకుడి కేసి చూస్తూ.

ఆ యువకుడు పాపనెత్తుకుని వరండా మెట్టుదిగి ఆస్పత్రి ఆవరణలోకి నడిచారు.

"ఆయన్ని మేము చూడవచ్చునా డాక్టరు గారూ?'' అడిగారు పెద్దాయన.

"ఆయన ఇంకా మైకంలోనే ఉన్నారు. స్పృహ ఇంకా రాలేదు. ఎవ్వరో కారులో విసురుగా గుద్దేసారు. ఆ రాకాసి డ్రైవరు వెనక్కి తిరుగయినా చూడలేదు. కాళ్ళకి పెద్ద గాయాలు తగిలినయి,'' అన్నారు సానుభూతితో డాక్టరు.

"ఆ డ్రైవరు బాగా త్రాగిఉన్నాడేమో డాక్టరుగారూ?' అన్నారు పెద్దాయన.

"అయియుండవచ్చండీ. ఇంతకీ పోలీసు దర్యాప్తు చేస్తున్నారులెండి. అన్నట్టు ఆయన బ్యాగ్ చెదిరి చాలా దూరాన్న పడి ఉందట. అప్పుడే తెలిసింది ఆయన పోలీసు ఇన్స్పెక్టర్ అని, జవాన్లు ఇక్కడే ఉన్నారు. అది మీకు handover చేస్తారు," అన్నారు డాక్టరు.

నిరంజనా పెద్దాయనా హాస్పిటల్ ఆవరణలోకి తిరిగి వచ్చేటప్పటికి, "నా పేరు చెపుతాను, ఉష, మరి నీ పేరూ?'' అంటోంది పాపాయి. తనని ఎత్తుకుని నుంచున్న యువకుడితో.

* * * *

నిరంజన ఇల్లు చేరి సోఫామీద కూలబడి పోయింది. గతించిన 3, 4 గంటలూ కలో, నిజమో ఆవిడకి తెలియడంలేదు. ఎదురుగా కుర్చీలో పెద్దాయన కూచుని ఉన్నారు. వరండాలో "ఈ గొలుసు నీ కెక్కడిది, మామయ్యా?'' అడుగుతూంది ఉష గారాబాలు కుడుస్తో వచ్చీరాని హిందీలో.

"అమ్మా, నేను మా ఇంటికెళ్ళి కాస్త ఏదయినా తినడానికి పట్టుకొస్తాను. ఇక ఇప్పు డెందుకు శ్రమ నీకు?'' అన్నారు పెద్దాయన.

నాకేమీ అక్కర్లేదండి. ఏమీ తినాలని లేదు. నావల్ల మీకూ ఆయనకీ కూడా భోజనం వేళతప్పి పోయింది. మీ ఇద్దరి ఋణమూ ఈ జన్మలో తీర్చుకోలేను.

"మహ బావుంది, నేనేం చేశాను! ముక్కూ ముఖమూ తెలియని ఆ కుర్రాడు అంతా చేసింది. అతని రూపేణా ఆ భగవంతుడే సాయ పడ్డాడు. కాస్త కాఫీ అయినా పుచ్చుకో అమ్మా నే వెళ్ళి తెస్తాను,'' అన్నారు ఆయన. "నేను చెప్పటం మరిచిపోయాను. కాఫీ అయితే అదిగో ఆ ఫ్లాస్కులో వుందదండి. ఇస్తాను,'' అంది నిరంజన లేవబోతూ.

"నువ్వు కూచో, నేనే పోసి ఇస్తాను," అంటూ ఆయనే లేచారు.

కాఫీ లవగానే, పెద్దాయన, "అమ్మాయ్, ఇంటో గాబరా పడుతూంటారు. నేను వెళ్లి వివరాలన్నీ చెప్పాలి. 10 దాటి నట్టుంది. చూడమ్మా, ఆ అబ్బాయి కూడా వెళతానంటున్నాడు. మరి నువ్వు ఒక్కదానివే, ఉండగలవా? మావాళ్ళ నెవ్వరినైనా పంపనా తోడు?" అన్నారు ఆయన లేచి నుంచుని.

"అబ్బె, ఏమీ అక్కర్లేదండి. ఉండగలను, ఇక మీరు శ్రమ పడకండి,'' అంది నిరంజన.

"నీకు ఏదయినా కావలిస్తే ఈ కిటికీలోనించీ కేక వెయ్యి. మాకు వినిపిస్తుంది. మరి ఉంటాను, కాస్త నిద్రపో. అబ్బాయి మరి కాస్సేపు ఉండే వెళ్లు నువ్వు మీ ఇంటికి,'' అంటూ లేచి బెత్తం చేత పుచ్చుకుని చక్కా వెళ్ళాడు పెద్దాయన.

తన భుజంమీద నిద్రపోతున్న పాపని హాలులో మూలనున్న ఉయ్యాల మంచం మీద ఆప్యాయంగా పడుకోబెట్టి లేచి నించున్నాడు, ఆ యువకుడు.

"నేను కూడా వెళ్లివస్తానండి,'' అన్నాడు. నిరంజన తల ఎత్తి చూసింది, ఎక్కడో ఎప్పుడో చూసినట్టనిపించిం దతని ముఖం. నిరంజనకి – ఒక్క క్షణం. కాదేమో! వట్టి భ్రమేమో!

కృతజ్ఞత హృదయంలోనించీ పొంగుకొచ్చింది నిరంజనకి. "మీరు హాస్పటలు లో డాక్టరుగారు చెప్పినట్లూ నాకు నిజంగానే తోబుట్టువులేమో ఏ జన్మలోనో,

ఈ జన్మలో నాకు అన్నదమ్ములు లేరు. మీరు అనుక్కుంటాను. మీ ఋణం తీర్చుకోలేము మేము. మావార్కి తేలి వచ్చేవరకూ ఉండండి.' అంది నిరంజన కళ్ల నిండా నీళ్ల క్రమ్ముతూ.

"ఒకరి కొకరు సాయపడడం మానవ ధర్మం. దానిలో పెద్ద విశేష మేముందండి?" అన్నాడు యువకుడు.

"వద్దనగా ఇంత డబ్బు ఖర్చుపెట్టారు టాక్సీకి. ఆఖరుకి గ్రుక్కెడు కాఫీ అయినా పుచ్చుకోలేదు.''

"ఫరవాలేదు, నేను వస్తాను మరి. మిమ్మల్ని ఈ ఆపద టైమ్‌లో ఒంటరిగా వదలి వెళ్ళడం నాకూ ఇష్టంలేదండీ, అన్నాడు యువకుడు.'

"పోనీ రేపు సూర్యోదయం వరకూ నైనా ఉండండి. పెద్దాయననీ మళ్లీ పిలుస్తాను మీకు తోడు. మా వారిని చూసి వెళ్ళండి. ఆయనని స్వయంగా మీకు కృతజ్ఞతలు చెప్పనివ్వండి, ప్రాణ భిక్ష పెట్టారు,'' అంది నిరంజన బ్రతిమాలే స్వరంతో.

"రేపు సూర్యోదయానికి నేను మనదేశపు పొలిమేరలు దాటి వెళ్లిపోతూ ఉంటాను. నేపాల్ వెళ్ళాలి,'' అన్నాడు యువకుడు ఏదో ఆలోచిస్తున్నట్టుగా.

"అయ్యోయ్యో! పోనీ మీ అడ్రస్సయినా ఇస్తారా?'' అడిగింది నిరంజన దీనంగా.

"మీ సోదరుణ్ణే అన్నారుగదమ్మా. ఇంకా అడ్రస్సెందుకు మళ్ళీ.''

"తిరిగి వచ్చాక వస్తారు గదూ ఒక్కసారైనా మా వారికి కనిపించి, ఆయన కృతజ్ఞతలు అందుకోరూ? ఒక్కసారి మా యింట్లో భోంచేసి అయినా వెళ్ళాలి," బ్రతిమాలింది నిరంజన బీద స్వరంతో.

"తిరిగి వస్తే కలుస్తామేమోలెండి. మరి నాకు Plane కి టైమ్ అయిందమ్మా. మరి వస్తాను. నమస్కారం.'' అని చేతులు జోడించి చర చర మెట్లు దిగి కాంపౌండు గేటు తెరుచుకుని రోడ్డు మీదికి నడిచాడు యువకుడు.

నిరంజన మెల్లగా వెనకే నడుస్తూ గేటు వద్దకి వచ్చి నిలబడింది.

వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. ఎక్కడా ఏ జీవి అటూ ఇటూ నడవడం లేదు. చుట్టూ ఇళ్ళన్నీ చీకటిగా వున్నాయి. అందరూ సుఖనిద్రలో ఉన్నారు.

ఆ నిశ్శబ్దంలో రోడ్డు ప్రక్కగా నగరం వేపుకి ఒక్కడే విసురుగా నడుస్తూ వెళ్లి పోతున్నాడు ఆ యువకుడు. అతని కాళ్ళ జోళ్ళ చప్పుడు తప్ప మరేమీ వినరావడం లేదు. నిరంజనకి గుండెలలో దిగులు క్రమ్మింది - ఎవ్వరో ఆపద్బాంధవులు తనని ఒంటరిగా ఎడారిలో విడిచి వెళ్తున్నట్టుగా అనిపించింది తనకి, ఆ క్షణంలో.

ఉన్నట్టుండి ఘటుక్కున ఎక్కడో దూరాన్నించీ గుడ్లగూబ కూత వినిపించింది- తపోవనంలో శాపంలా. నిరంజనకి ఒళ్లు గగ్గురు పొడిచింది. ఏమో ఏవేళ లెట్టివో. తనని భగవంతుడు ఎల్లా చూడనై ఉన్నాడో.

ఒక్క క్షణంలో ఆకాశంలో దూరంనించీ రాత్రి చిరు చీకటిలో రెక్కలు చాపుకుని, ఎగురుతూ వస్తూంది గుడ్లగూబ. రోడ్డుకి రెండో వేపునించి, అంత సంస్కారం ఉన్న నిరంజన ఆవేళకి కళ్ళ కప్పగించి పైకి ఆ శకునపక్షి వేపు చూస్తూ నిలబడిపోయింది.

ఆ పక్షి రోడ్డు లైటు మీదినించి ఎగురుతూ నగరంవేపు వెళ్లి పోయింది. లైటు క్రింద ఆ యువకుడు నడుస్తూ పోతున్నాడు. అతని కాళ్ల చప్పుడు కూడా తగ్గి పోతూంది.

నిరంజన మెల్లగా ఇంట్లోకి నడిచింది.

లైటు ఆర్పకుండానే సోఫామీద వాలింది నిరంజన. నిద్ర రావడంలేదు. ఆలోచనలతో తలకాయ బ్రద్దలై పోతూంది.

ఇది అంతే ఈ బ్రతుకు ఎప్పటికప్పుడే నెత్తురుకూడే. పాపమా అబ్బాయి ఎవ్వరో గదా! ప్రాణ భిక్ష పెట్టాడు. ఏనాటి ఋణానుబంధమో. అయినా ఈపాడు కేసు లేకపోతే ఆ దిక్కుమాలిన సందుల్లోకి అన్వేషణకి వెళ్లి ఉండరు గదా ఆయన. ఎదురుంగా టేబిల్ మీదNews Paper మడిచి పెట్టిఉంది. కళ్లకి కొట్టవచ్చేటట్టూ పెద్ద పెద్ద అక్షరాలలో ఆ కేసు వ్రాసిఉంది. ఆ పీడ కేసు ఈయనకి దాపరించింది. ఆ పెద్ద అక్షరాల క్రింద సొగసైన ఒక జవ్వని ఫోటో వేసి ఉంది. చుక్క బొట్టూ, తీర్చి దిద్దిన కను ముక్కుతీరూ - మంచి అందగత్తే. అందుకనే ఆవిడ భర్తకి అనుమానం వేసింది గాబోలు. పడక గదిలో మరొక విటుడున్నాడుట. అతను తప్పించుకు పారిపోయాడుట. ఏ మగవాడికి ఉద్రేకం రాదు గనుకను! ఆ వెర్రి ఉద్రేకంలో ఘటుక్కున రివాల్వర్ తీసి కాల్చేసాడుట - భర్త. ప్రక్కిళ్ళవాళ్ళు

చెప్పారుటగా, భర్తలేనప్పుడల్లా ఒక పెద్ద కారులో ఒక అతను వస్తూన్నాడని. ఆ హత్య జరిగిన రాత్రికూడా ఆ వీధి చివర ఆ కారు ఆగిఉందట. పాడు గోల, ఎవళ్లు ఎల్లా పోతే మన కెందు కిప్పుడు. అసలు, ఇంతకీ ఈయనగారికి ఆ కాళ్లు సరిగ్గా వస్తాయా? "చూద్దాం" అన్నారేగాని, ఆ డాక్టరు గట్టిగా ధైర్యం చెప్పలేదు.

అబ్బబ్బ! తల తిరుగుతూంది. తలకాయలో ఏదో ఘోష వినిపిస్తున్నట్టుగా ఉంది. మనస్సూ ఒళ్ళూ కూడా అలసిపోయినయి.

* * * *

తెల్లవారుతూంది. ప్రక్కింటివారి మేప చెట్టునిండా వెయ్యి పిచ్చుకులు ఒక్కసారిగా అరుస్తున్నయి.

నిరంజన లేచి కలలో నడిచినట్టుగా నడిచింది. ఇంకా గతరాత్రంతా ఏదో ఒక విష స్వప్నం లాగానే ఉంది.

నిన్న ఈ వేళపుడు ఇంట్లో ఉప్మాతిని కాఫీ తాగారు - సుఖంగా. ఇంత అకస్మాత్తుగా ఇంత మార్పు కలిగింది, తిరిగి బాగుపడతారా! తిరిగి ఎప్పటిలా నడుస్తారా ఈయన ?

అబ్బ ! తల చెక్కలవుతోంది.

టేబిల్‌మీద ఉన్న గ్లాసులో నీళ్లు ఒక గ్రుక్కెడు తాగింది. పేపరులో అక్షరాలు కళ్ళకి కొడుతూన్నయి. కేసు వివరాలన్నీ తనకి ఇదివరకే క్షుణ్ణంగా తెలుసు, పేపరులో ఫోటోలో ఉన్న ఆడపిల్లని చూస్తే జాలి వేసింది. ఇంత పడుచుదనంలో ఇంత బలవన్మరణం! పాపం ! కుడి బుగ్గమీద చక్కని చిన్న మచ్చ ఉన్నది. ఎడమకంటి మీదకి పడేటట్టు దువ్విన ఆ జుట్టూ, అదీ ఏదో ప్రత్యేకత తెలుపుతోంది. పాపం, భర్తే చంపి ఉండకపోతే అట్లా అజలేకుండా పారిపోతాడా? పెళ్లి ఫోటో కూడా తీసి కాల్చేస్తాడా? ఆవిటుడి కారు కోసం కూడా వెతుకుతున్నారుటగా. ఇంతకీ ఈ పాపిష్టి కేసులో దొరికిందల్లా ఆ ప్రచురించిన చిన్న ఫోటో ఒక్కటి. అదైనా ఆ భర్త విద్యార్థిగా ఉన్నప్పటిదాయె. హంతకుణ్ణి ఎల్లా పట్టడమా అని ఈయన గారికి. ఈ రెండు మూడు దినాలుగా, అదే ఆలోచన అయిపోయె. దోషినిపట్టి తెచ్చేవరకూ ఈయనకి నిద్రాహారా లుండవు. చట్టం అంటే చట్టం, న్యాయం అంటే న్యాయమే

ఈయనకి. కన్న కొడుకునైనా సరే పట్టి తెచ్చేరకం. ఒక విధంగా చూస్తే, అదీ మంచిదే. ప్రపంచంలో దుష్టత్వం తగ్గిపోతుంది. అబ్బ! ఏమి హత్యలురా దేవుడా! తన పెళ్లి అయినప్పటినించీ భర్తవల్ల తను తెలుసుకున్న దారుణ హత్యలు ఎన్నో! అదే అహర్నిశలూ, నిరంజనకి భయం - ఎవరు భర్తమీద ఏ కక్ష పడతారో అని.

తల బరువుతో వంట ఇంటివేపు నడిచింది. ఏదోయంత్రంలా అలవాటుగా పాలు కలిపి పాపకి తెచ్చింది.

ఉయ్యాల ప్రక్కన ఉన్న టేబిల్‌మీద పేపరు ప్రక్కగా ఆ పాల టంబ్లరు పెట్టి ఉయ్యాలలోకి వంగి చూసింది. ప్రశాంతంగా నిద్రపోతున్న పాప కాస్త కదిలింది. పాప మెళ్ళో సన్నని బంగారు గొలుసు కనిపించింది. ఇది నిన్న ఆ అబ్బాయి మెళ్ళో ఉన్న గొలుసు గాబోలు. ఆ గొలుసు పట్టుకుని డాలరు నోట్లో పెట్టుకుంటూ ఆడుతూంది నిన్న ఉష. అతని వళ్ళో కూచుని అతను దానిని ఎత్తుకున్నప్పుడూ కూడా ఈ రాక్షసి ఆ గొలుసు వదలలేదు. ఆడుక్కుంటూ అల్లాగే మెళ్ళో వేసుకుంది గాబోలు. అతనే వేశాడేమో, దీనిని ఊర్కో పెట్టడానికి. పాపం, అల్లాగే అతను మర్చిపోయి వెళ్లి పోయాడెల్లే ఉంది. అయ్యో ఖర్మ కాలి. అతని అడ్రస్సు కూడా తెలియకపోయె!

"ఉషా." అని పిలిచింది నిరంజన కాస్త ఆత్రంగా.

పాప కాస్త కదిలింది. చిట్టి చిట్టి చేతులతో కళ్లు నలుపుకుంటూంది.

బయట కిటికీలోనించీ పడుతూన్న లేత ఎండ కాస్త తగ్గింది. చిన్నమబ్బు ఒకటి ప్రొద్దు కడ్డం వచ్చింది.

ఛటుక్కున, నిరంజన పాముని చూసినట్టూ ఉయ్యాలలోకి కళ్ళుప్పగించి చూస్తూ నుంచుండి పోయింది. ఒక్క క్షణంలో తిరిగి తేరుకుని వంగి నిదానంగా చూసింది.

కళ్లు చీకట్లు క్రమ్మినయి నిరంజనకి. కాళ్ళ క్రింద భూమి బ్రద్దలయిన ట్లనిపించింది. ప్రక్క సోఫామీద కూలబడ్డది.

సాక్షాత్ అదే చుక్కబొట్టు, అదే జుట్టు, అదే బుగ్గమీదమచ్చ అదే ముఖం సవ్వాల్ చేసే కళ్ళు - పేపరులో ముద్రించి ఉన్న ఆహత యువతి ఫోటో ఆ

గొలుసు డాలరులో తగిలించి ఉంది. డాలర్ అంచుమీద "నా ప్రియ భార్య" "My beloved wife" అని ఇంగ్లీషులో ఎన్గ్రేవ్‌చేసి వ్రాసి ఉంది.

నిరంజన ఒక్క క్షణంలో మనస్సు కూడ గట్టుకుని ప్రయత్నంమీద పాప మెళ్ళోంచి ఆ గొలుసు లాగేసింది.

బాత్‌రూమ్ వేపు పరిగెట్టింది - ఎవ్వరో తరుముకొస్తున్నట్టు. కుళ్ళాయికి ఎదురుంగా గుడ గుడమంటూ, మురికినీళ్ళ గొట్టంలో నీళ్లు భూలోకంలోకి పోతున్నాయి. ఒక్క విసురున ఆ గొలుసు యావత్తూ ఆ నీళ్ళలోకి విసిరి పారేసింది, నిరంజన.

ఉయ్యాలలో పాప నిటారుగా లేచి కూచుంది. "నా గొలుసు నాకిచ్చెయ్యి. తే నాది నాకియ్యి, రాత్రి మామయ్య నా కిచ్చేశాడది. మామయ్యేడి?" ఏడుపు గొంతుకతో అరుస్తోంది. పాప, చిన్నారు చేతులతో మెడ తడుపుకుంటూ.

బయట తలుపు కొడుతున్న శబ్దం. "అమ్మాయ్," అంటున్నారు ప్రక్కింటి పెద్దాయన.

✤ ✤ ✤